క్లుప్తంగా

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన పశువైద్యులు



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం ఇస్తున్న పశువైద్యాధికారులు

అనంతగిరి: పశు సంవర్ధకశాఖ ఉద్యోగుల సమస్యలు, పశువైద్యాధికారుల పదోన్నతులు తదితర విషయాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు పశుసంవర్ధకశాఖ రాష్ట్ర వైద్యాధికారుల సంయుక్త సంఘం కార్యదర్శి సాగిరి గణేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో విజయనగరంలోని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేసినట్టు చెప్పారు. పశుసంపదపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు నిధులు మంజూరు చేసి, మరింత ఆర్థికంగా ఆదుకోవాలని కోరగా, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో దుర్గారావు, విష్ణు తదితరులు న్నారు.

నూనె గింజలు నిల్వ చేయడంపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి: గిరిజన రైతులు పండిస్తున్న వివిధ రకాల నూనె గింజలను నిల్వ చేసుకోవడంపై గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సమరవీధిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 20 మంది రైతులకు గింజల నిల్వ ఉంచుకునేందుకు ప్రత్యేక సంచులను పంపిణీ చేశారు. భూసార శాస్త్రవేత్త బుర్ల శ్రీహరిరావు మాట్లాడుతూ మన్యంలో గిరిజనులు సాగు చేస్తున్న వలిసెలు, వేరుశనగ వంటి నూనె గింజల పంటలకు మంచి ధరలు పలుకు తుండడంతో విత్తనాలు నిల్వ చేసుకునేందుకు ఈ సంచులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పలువురు విజ్ఞాన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు ఈశ్వర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో భారీ వర్షం



వై.రామవరంలో కురుస్తున్న వర్షం

వై.రామవరం: మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. సుమారు 4 గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో ఎక్కడివారు అక్కడే నిలచిపోయారు. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అటవీప్రాంతం నుంచి వచ్చిన విద్యుత్ లైన్ల వెంబడి తీగలపై చెట్టు కొమ్మలు విరిగిపడి సాంకేతిక లోపం తలెత్తి విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల మండలం అంధకారమైంది. తాగునీటి పథకాలు పనిచేయక తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

నేడు గన్నెలలో గడప గడపకు

అరకులోయ రూరల్: మండలంలో గన్నెల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వేరుశనగ సాగు.. లాభాలు బాగు

- సంతల్లో జోరుగా అమ్మకాలు
- గిరి రైతుల ఆనందం



సీతగుంట పంచాయతీలో వేరుశెనగ సాగు

పెదబయలు: జిల్లాలో వేరుశనగ సాగు ఏటా పెరుగుతోంది. పంట చేతికందిన సమయం నుంచే మంచి మద్దతు ధర ఉండడంతో రైతులు సాగుపై ఆశక్తి చూపిస్తున్నారు. ఏటా పండించిన వేరుశనగ వారపు సంతల్లో గిట్టుబాటు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ పోషక విలువులు కలిగిన ఈ సాగు మండలంలోని సీతగుంట, అరడకోట,అడుగులపుట్టు. మండలంలోని గంపరాయి, గలగండ, పెదకోడాపల్లి. లక్ష్మీపేట, వనభంగి. పవ్రెడ పంచాయతీలో సాగు ఎక్కువగా చేస్తున్నారు. వేరుశనగ బస్తా మొదటి రకం రూ.1400 నుంచి రూ.1900వరకు ధర పలుకుతుంది. దీంతో రైతులు ఈ పంటపై ఎక్కువ దృష్టిపెడుతున్నారు. గత ఏడాది 61 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తే ఈ ఏడాది 109.2 హెక్టార్లలో సాగు చేశారు. సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులు అధికంగా ఏ పంటకు లాభాలు వస్తే అదే పంటకు ఆశక్తి చూపిస్తున్నారు. జిల్లాలో 22 మండలాల్లో వేరుశనగ సాగు 1616 హెక్టార్లలో సాగు జరుగుతుంది. అయితే గిరిజన ప్రాంతంలో సాగుకు ఎలాంటి ఎరువులు వేయకుండా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడంతో ఇక్కన వేరుశనగకు మంచి గిరాకీ ఉంది. మద్దతు ధరతో వారపు సంతల్లో మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగ సాగుకు అంతర పంటలుగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు.వేరుశనగతో పాటుగా మొక్కజొన్నలు కూడ ఆదాయం లభిస్తోందని, స్వీట్ కార్న్ మంచి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఆదాయం బాగుంది

గత కొన్నేళ్లగా వేరుశనగ సాగు చేస్తున్నాం. మంచి లాభదాయకమైన పంట. ఎక్కువ పెట్టుబడి లేకుండా ఎలాంటి ఎరువుల వాడకుండా సాగు చేస్తున్నాను.సేంద్రియ ఎరువు మాత్రమే వాడడం జరుగుతుంది. గత ఏడాది నుంచి గ్రామానికి వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.ఈ ఏడాది ఎకరా విస్తీర్ణంలో సాగు చేశాను.
– కొర్రా రాంబాబు, గిరిజన రైతు, తమరడ గ్రామం, పెదబయలు మండలం

సాగు విస్తీర్ణం పెరిగింది



మండలంలో వేరుశెనగ సాగు తక్కువ పంచాయతీల్లోనే చేస్తున్నప్పటికి ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.పంటకు అనుకూలంగా వాతావరణం ఉండడం, మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు ఆశక్తి చూపిస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు వేరుశెనగ పంట తీస్తున్నారు. అలాగే రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తన శుద్ధి, సేంద్రీయ ఎరువులు వాడకం, కలుపు నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. – ఎ.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి, పెదబయలు మండలం

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే

- వైద్య సిబ్బందికి అవగాహన
- ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు



గూడెం కొత్తవీధి మండలంలోని రింతాడలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ సూచనల మేరకు రింతాడ–1 సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల వివరాలను ట్యాబ్‌లో పొందుపరిచారు. రింతాడ–1 సచివాలయంలో అక్టోబర్ 13న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, సచివాలయ ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు కుమారి, మణి, వలంటీర్ సింహాచలం పాల్గొన్నారు

గంగవరం: మండలంలోని ఏటి పల్లి, పిండికొండ వీది, సాగిన వీధి గ్రామాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన మాట్లాడుతూ మండలంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రోగులకు టోకెన్లను అందజేశారు. హెల్త్ విజిటర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు కుందన, సుకన్య, హెల్త్ అసిస్టెంట్ స్వామి ఏఎన్ఎం సత్యవతి, ఆశ వర్కర్లు పద్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.



వై.రామవరం తహసీల్దార్ శ్రీనివాసరావు

30న మోహనాపురంలో మెగా వైద్య శిబిరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మోహనాపురం గ్రామ సచివాలయంలో ఈనెల 30న మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వైద్యాధికారి భావన తెలిపారు. అలాగే అక్టోబర్ 4న జడేరులోని, 6న గార్లపాడు గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ సచివాలయం వద్ద ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమం నిర్వహణకు నియమించిన టీమ్–1 అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తప్పని సరిగా హాజరుకావాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రతిషాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమన్ని మండలవాసులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణనాథునికి దీపారాధన

అనకాపల్లిటౌన్: మండలంలోని గుండాలవీధిలో బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతి చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి మండపం వద్ద గురువారం సాయినగర్ భక్తులు దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పొలమరశెట్టి కృష్ణ, రాంబాబు, వెంకటేష్, రమణబాబు, రాజు, లీల పాల్గొన్నారు.

పథకాలపై విస్తృతంగా అవగాహన

కొయ్యూరు: మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాడేరు బీజేపీ ఇన్‌చార్జి కూడ కృష్ణారావు స్థానిక నాయకులతో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ నాయకులు పర్యటించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సడక్ యోజన, జల్‌జీవన్ మిషన్ తదితర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. నాయకులు ఎ.రాజు, ఆర్.చంద్రరావు, కె.నూకరాజు, కె.కర్రయ్య, జి.దేముడు, సుబ్బయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోండ్వానా గణతంత్ర పార్టీ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

చింతూరు: గోండ్వానా గణతంత్ర పార్టీ జాతీయ అధ్యక్షుడు సీడం అర్జున్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక గురువారం చింతూరు మండలం పోతనపల్లిలో జరిగింది. అధ్యక్షుడిగా కె.రవి, ఉపాధ్యక్షుడిగా ఎం. కన్నారావు, కార్యదర్శిగా కె.శ్రీను తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గణతంత్ర పార్టీ బలోపేతానికి చర్యలు చేపడతామని, 1/70, పీసా చట్టాలు పకడ్బందీగా అమలయ్యేలా కృషి చేస్తానన్నారు. ముత్తయ్య, దూలయ్య, బాలకృష్ణ, అర్జున్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు



రంపచోడవరంలోని గణనాథుని ఊరేగింపులో గ్రామస్తులు

గంగవరం : మండలంలో పాతగంగవరం రామాలయం, కొత్త గంగవరం రామాలయాల పరిసరాల్లోని మండపాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. గణనాథుని విగ్రహాల ఊరేగింపులో చిన్నారులు, యువత డ్యాన్సులతో సందడి చేశారు. అనంతరం జడేరు సమీపంలోని పెద్దేరు వాగులో విగ్రహాలను నిమజ్జం చేశారు. నెల్లిపూడి, కొత్తాడ, గార్లపాడు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను సూరంపాలెం జలాశయంలో నిమజ్జనం చేశారు.

రాజవొమ్మంగి: స్థానిక విద్యానగరం, శివాలయం వీధులలో ఏర్పాటు చేసిన మండపాల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగిస్తు నిమజ్జనోత్సవాలను గురువారం భక్తులు ఘనంగా జరిపారు. డ్యాన్స్‌లు వేస్తూ, బాణాసంచా కాలూస్తూ ఊరేగింపులో యువత సందడి చేశారు. అనంతరం గణనాథుని విగ్రహాలను వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఎస్‌హెచ్‌ఓ గోపీ నరేంద్రప్రసాద్ నేతృత్వంలో స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కొయ్యూరులో ఊరేగింపులో స్థానికులు



గంగవరంలో గణపతి విగ్రహాల ఊరేగింపు



రాజవొమ్మంగిలో వినాయక నిమజ్జనోత్సవాల్లో భక్తుల కోలాహలం

కొయ్యూరు: మండల కేంద్రంలోని వినాయక ఊరేగింపును గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వందలాది మంది దీనిలో పాల్గొన్నారు. సర్పంచ్ మాకాడ బాలరాజు, కమిటీ సభ్యులు ఎం.వి.ఎస్.ప్రసాద్,అనిశెట్టి చిరంజీవి,మాకాడ బూర్గలయ్యా, విగ్రహదాత కర్రి సత్యనారాయణతో పాటు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీ ఊరేగింపు అనంతరం గణనాథుని విగ్రహాన్నీ సమీప గెడ్డలో నిమజ్జనం చేశారు. అనంతరం జరిగిన లడ్డూ వేలంపాటలో అరిగెట్ల నాగరాజు రూ.15 వేలకు దక్కించుకున్నారు.

పోస్టల్ ఈడీ ఉద్యోగులకు కానుకలు

రాజవొమ్మంగి: కో–ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం గల పోస్టల్ ఈడీ ఉద్యోగులకు సొసైటీ (కాకినాడ) ప్రెసిడెంట్ కె.ప్రసాద్ గురువారం ట్రావెల్ బ్యాగ్స్ కానుకలు అందజేశారు. స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో జరిగిన సమావేశంలో 22 మంది ఈడీ ఉద్యోగులు పాల్గొనగా సొసైటీ అందజేస్తున్న సేవలను ప్రసాద్ వివరించారు. ఈ ఏడాది ఉద్యోగులకు ఇవ్వాల్సిన డివిడెండ్లను కూడా ఆయన పంపిణీ చేశారు. కార్యదర్శి ఎస్.వి.వి.అన్నపూర్ణేశ్వరరావు, సభ్యులు కాకర్లపూడి సీతారామరాజు, విక్రమహంతి అప్పారావు, మువ్వల కృష్ణ, తూపాటి సుబ్బరాజు, కేవీ. రమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ ఈడీ ఉద్యోగులకు కానుకలు అందజేస్తున్న సొసైటీ ప్రెసిడెంట్ ప్రసాద్

ముల్లంగికి గిరాకీ



ముల్లంగిను శుభ్రం చేస్తున్న గిరిరైతులు

దుంబ్రిగుడ: ముల్లంగికి మార్కెట్‌లో ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. వారపు సంతల్లో జోరుగా విక్రయిస్తున్నారు. మండలంలోని కొర్రాయి, గసభ, సొవ్వ, కోల్లాపుట్టు, సాగర పంచాయతీల్లో ముల్లంగిని విస్తారంగా పండిస్తున్నారు. కూరగాయలతో పాటు ముల్లంగి సేకరణ జోరందుకుంది. రైతులు సేకరించిన ముల్లంగిని సమీప గెడ్డల్లో శుభ్రం చేసి సంతలకు తరలిస్తున్నారు. మన్యంలో సాగుచేసే ముల్లంగికి మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఉంది. ముల్లంగికి సంతల్లో గిట్టుబాటు ధరలు వస్తున్నాయని, విశాఖపట్నం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు ఉన్నాయని, రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెదలంకలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కుమారి, సర్పంచ్ కృష్ణవంశీ



కొండగోకిరిలో బస్‌షెల్టర్ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ముసిలినాయుడు, నేతలు

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీ పెదలంక గ్రామానికి రూ.60లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులకు ఎంపీపీ బోయిన కుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గ్రామంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించినపుడు స్థానికులు రోడ్డు కోసం విన్నవించారని, దీనిపై ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు. సర్పంచ్ కృష్ణవంశీ మాట్లాడుతూ రోడ్డు మంజూరు కావడంతో స్థానికుల సమస్య తీరిందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బి.లక్ష్మణ్, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్ వై.ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గిరిప్రసాద్, నాయకులు చిన్నభాయ్, శ్రీరాములు వెంకట్, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, శంకర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని కొండగోకిరిలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మంజూరు చేసిన నిధులతో బస్ షెల్టర్ పనులకు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు గురువారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులను ఎంపీ మాధవి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. ఈ మేరకు రూ.ఐదు లక్షలతో బస్ షెల్టర్ పనులు చేపడుతున్నామన్నారు. నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



మాట్లాడుతున్న గంగరాజు ఆచారి

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ మధురమామిడి గ్రామంలో సభశ్రమం శ్రీ భగవాన్ స్వామి చిద్గాగనానంద మహర్షుల వర్ధంతి (ఆరాధన) గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆశ్రమంలో పూజలు చేశారు. సభశ్రమ అధ్యక్షుడు గంగరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రశాంత జీనవం కలుగుతుందన్నారు. సత్యం, జ్ఞానం, ధర్మం, దయ, శాంతి, ఓర్పు గూర్చి ఆయన వివరించారు. శ్రీ చిద్గగనానంద మహర్షుల చరిత్రను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అరకులోయలోని అన్నదానంలో భక్తులు



చింతపల్లిలో అన్న సమారాధన

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని బి–కాలనీలో వినాయక వేడుకల్లో భాగంగా రెడ్‌రెబల్ యూత్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీను, సాయి, లోకేష్, ప్రశాంత్, రాజా తదితరులు పాల్గొన్నారు

చింతపల్లి: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో గురువారం వినాయక చవితి వేడుకలు పురస్కరించుకొని భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చవితి కమిటీ నాయకులు దూనబోయిన రమణ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది భక్తులకు 20 రకాల వంటకాలతో భోజనాలు వడ్డించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేయనున్నట్లు రమణ తెలిపారు. మరో వైపు బ్యాంకుకు సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా నిమజ్జనం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చిన్నారావు

దుంబ్రిగుడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు అన్నారు. మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ చంపగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ సీతారాం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినగ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. విశాఖ పరిపాలన రాజధానిను ప్రజలందరూ స్వాగతిస్తున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సమర్డి భాస్కరరావు మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధాని రావడంతో ఉత్తరాంధ్ర మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు కఠినంగా శిక్షించాలన్నారు. జగనన్న ప్రభుత్వంతోనే గిరిజన ప్రాంతంలో అభివృద్ధి చెందుతోందన్నారు. సర్పంచ్ హరి, నాయకులు భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ రఘునాథ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కాసులమ్మ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొములునాయుడు ,మాజీ సర్పంచ్ అప్పలరాజు, నాయకులు అశోక్‌కుమార్, రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ సుందర్‌రావు, పరపరాం, గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అడ్డతీగల: మట్లపాడు, గొంటువానిపాలెం, కిమ్మూరు పంచాయతీల్లో బీటీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే ధనలక్ష్మితో పాటు ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. మట్లపాడు–గొరగొమ్మి, మట్లపాడు–కొత్తపాలెం, గొంటువానిపాలెం, కిమ్మూరు–పులిగోగులపాడు, కిమ్మూరు–సరంపేటపాడు మధ్య బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తారన్నారు. దీంతో పాటు కిమ్మూరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం కొత్తపాలెం, కిమ్మూరు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని ప్రవల్లికను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రంపచోడవరం: కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కొమరం ప్రవల్లిక అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం లక్ష్మి తెలిపారు. ఆమె మట్లాడుతూ అనపర్తి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ , అల్లూరి సీతారామరాజు జిల్లాలకు నిర్వహించిన పోటీల్లో ప్రవల్లిక ఉత్తమ ప్రదర్శన కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. విద్యార్థిని ప్రవల్లికను హెచ్‌ఎం లక్ష్మీతో పాటు పీడీ సుగంధి, పీఈటీ గౌరీ శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.